## గంజాయి తరలిస్తున్న తమిళనాడు యువకుడు అరెస్ట్

ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:



స్థానిక రైల్వే స్టేషన్ వద్ద 9.890 కిలోల గంజాయి తరలిస్తున్న తమిళనాడు కవరనకులంకి చెందిన బాల మురళి కృష్ణ సెల్వరాజ్ అనే 25 ఏళ్ల యువకుడుని టౌన్ ఎస్ఐ ఎం.ముకుంద రావు అరెస్ట్ చేసినట్లు సిఐ ఎం.చిన్నం నాయుడు చెప్పారు. చెన్నై ప్రయివేటు ఎలక్ట్రికల్ లిమిటెడ్‌లో పని చేస్తూ గంజాయికి అలవాటు పడి పునమల్లే ప్రాంతం రూమ్‌లో ఉండేవాడు. అదే ప్రాంతంలో ధనీష్ అనే గంజాయి వ్యాపారితో పరిచయం పెంచుకొని ఒడిశా ఖుర్దాలో ధనీస్ చెప్పిన కమల లోచన్ బెహరా అనే వ్యక్తి వద్ద గంజాయి కొని తీసుకుని వస్తే 15 వేలుకు కిరాయి మాట్లాడుకున్నారు. గొడి పద టోల్ గేట్ వద్ద గంజాయి తీసుకుని ఇచ్ఛాపురం వస్తుండగా అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇచ్ఛాపురం, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:

స్థానిక ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 11 నుండి 2 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని పలాస ఈఈ జి.యఘ్నేశ్వరరావు చెప్పారు. గొల్లవీధి, వి.కే.పేట, ఫకీరుపేట, స్టేషన్ రోడ్డు, సంతపేట, హాస్పిటల్ రోడ్డు, కార్జివీధి, దాసన్నపేట, రథంవీధి, మెయిన్‌రోడ్డులో ఉంటుందని చెప్పారు.

## పేదలకు దుప్పట్లు , అన్నప్రసాద వితరణ



టెక్కలి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :

అభయం సేవా సమితి ద్వారా రావివలస గ్రామానికి చెందిన కీ.శే. కొత్తూరు మల్లయ్య నాయుడు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు సోమవారం పేదలకు దుప్పట్లు, అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో మల్లయ్య నాయుడు కుమార్తె శ్రీకాకుళం జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అడ్వకేట్ శైలజ, అల్లుడు జగదీష్ , కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## సాయన్న గెడ్డలో పూడిక, గుర్రపు డెక్క తొలగింపు చర్యలు

సంతకవిటి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :



గత15 సంవత్సరాలుగా సాయన్న గెడ్డలో పూడిక మరియు గుర్రపు డెక్కను తీయకపోవడంతో సాయన్న కాలువపై ఆధారపడి ఉన్న పొలాలకు సాగునీరు అందక పంటలు దిగుబడి రాక రైతులు ఆవేదన చెందుతున్నారు. ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకపోవడంతో సంతకవిటి మండలం చిత్తారపురం పంచాయతీలోని గారన్నాయుడుపేట గ్రామ రైతులు సాయన్న గెడ్డలో దిగి తాడు సహాయంతో గెడ్డలో ఉన్న గుర్రపు డెక్కను గత రెండు మూడు రోజులు నుండి తొలగిస్తున్నారు. గారన్నాయుడుపేట గ్రామంతో పాటుగా సంతకవిటి మండలం, పొందూరు మండలం బూర్జ మండలం ప్రజలు, గారన్నాయు దుపేట-పనసపేట గ్రామాల మధ్య ఉన్న సాయన్న గెడ్డపై ఉన్న నడక వంతెన నుంచి ద్విచక్ర వాహనంపై రాకపోకలు సాగిస్తారు. ఈ వంతెన చాలా ప్రమాదకరంగా ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుం దోనని ప్రజలు భయపడుతున్నారు. ఈ గెడ్డపై శాశ్వతంగా వంతెన నిర్మాణం చేయాలని ప్రభుత్వాన్ని ప్రజలు కోరుతున్నారు.



## ఘనంగా నీలమణి దుర్గ ఆలయ ప్రతిష్ఠ

కంచిలి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :

మండలం మఖరాంపురం గ్రామంలో వెలసిన శ్రీశ్రీశ్రీ నీలమణి దుర్గ అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం రజక సంఘం మఖరాంపురం ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, ధార్మిక కార్యక్రమాలు నిర్వహించగా గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, భక్తులతో పాటు ఎంటిఎస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుడ్డెపు కామేష్‌రెడ్డి, వైకాపా నాయకులు గుమ్మడి రాందాస్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రతిష్ట కార్యక్రమం భక్తుల సందడితో ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా జరిగింది. కార్యక్రమంలో భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## ఐటిడిఏ ప్రజా గ్రీవెన్స్‌కు 38 వినతులు

సీతంపేట, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :



ఐటీడీఏ ఎస్సార్ శంకరం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా గ్రీవెన్స్‌కు 38 వినతులు వచ్చినట్లు పిఓ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ తెలిపారు. ఆరఓఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయాలని సన్యాసిపేటకు చెందిన సవర నీలిమ వినతి పత్రం అందజేశారు. సీతంపేటకు చెందిన పిసా అధ్యక్షులు ఉపాధ్యక్షుడు గ్రామ సభ తీర్మానంకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని పాలక విజయకుమారి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ రమాదేవి, ఉప వైద్యాధికారి డాక్టర్ విజయ పార్వతి, డిప్యూటీ డిఇఓ పి.నారాయుడు, వివిధ శాఖలకు చెందిన అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పూతికవలస, చిన్న బగ్గ ఆశ్రమ పాఠశాలలు ఆకస్మిక తనిఖీ



సీతంపేట, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :

ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పూతికవలస చిన్నబగ్గ ఆశ్రమ ఉన్నత పాఠశాలలను ఐటీడీఏ ఉపవిద్యా శాఖ అధికారి పాలక నారాయుడు సోమవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. పాఠశాలలో విద్యా ప్రమాణాలు, విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రత, విద్యా కార్యక్రమాలను పరిశీలించారు. డిజిటల్ విద్య విద్యార్థుల అభ్యసనానికి ఉపయోగపడే యూట్యూబ్ వీడియోల లింకులను ముందుగా డౌన్‌లోడ్ చేసి, అవసరమైన సందర్భాల్లో డిజిటల్ పద్ధతిలో పాఠాలను బోధించాలన్నారు. పాఠశాలలపై విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రజల్లో సానుకూల అభిప్రాయం ఏర్పడేలా పాఠశాల విద్యా, సాంస్కృతిక అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. ఇప్పటి నుండే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు 2027 లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని, విద్యార్థుల ప్రాథమిక అభ్యసన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పాల్గొన్నారు.

## యాక్సిస్ బ్యాంక్ డైరెక్టర్‌గా గిరిధర్



పొందూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :

స్థానిక పోస్టాఫీసు వీధికి చెందిన కుప్పిలి శేషగిరిధర్ ప్రతిష్టాత్మకమైన యాక్సిస్ బ్యాంక్ బోర్డు డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఎల్.ఐ.సిలో అత్యున్నతమైన ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పని చేస్తూ గత నెల 31న ఉద్యోగ విరమణ చేశారు. గిరిధర్ ప్రతిభా పాటవాలను పరిగణనలోకి తీసుకుని బ్యాంకింగ్ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ బోర్డు(ముంబయి)లో నామినీ డైరెక్టర్‌గా శేషగిరిధర్‌ను నియమించింది. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్నట్టు చిన్నప్పటి నుంచి చదువులో విశేషమైన ప్రతిభ కనబరిచేవారు. ప్రాథమిక విద్యను స్థానిక రెండో నెంబర్ ప్రాథమిక పాఠశాల, హైస్కూల్ విద్యను గుంటూరు జిల్లా తాడికొండ గురుకుల పాఠశాల,ఇంటర్ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఇంజనీరింగ్ విద్యను విశాఖపట్నం గీతం ఇంజనీరింగ్ కళాశాలలో జయప్రదంగా పూర్తి చేశారు. ఈయన తండ్రి కె.ఎల్.వి ప్రసాదరావు విశ్రాంత గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు శేషగిరిధర్‌ను లేఖ మాసపత్రిక (హైదరాబాద్) సంపాదకులు జె.వి.చంద్రబాబు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వాండ్రంగి కృష్ణదాసు, ఎస్.బి.ఐ పూర్వ జనరల్ మేనేజర్ వి.మధుసూదనరావు, విశ్రాంత ఎం.పి.డి.వో కుప్పిలి శ్రీనివాసరావు, ఖాదీ కార్యాలయ హిందీ తెలుగు ట్రాన్స్‌లేటర్ జల్లేపల్లి శంకరరావు తదితరులు అభినందించారు.

## అనధికార మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ శాఖ డేగ కన్ను



పొందూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :

ఎక్సైజ్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వై.రాజు ఆధ్వర్యంలో బెల్ట్ షాపులపై ప్రత్యేక డేగ కన్ను వేశారు. అనాధికార మద్యం, కల్తీ మద్యం, గంజాయి, సారా వంటి నిషేధిత మత్తు పదార్థాల అమ్మకందారులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అమ్మకాలు జరిపితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నిషేధిత మత్తు పదార్థాలు విక్రయించే వారు ఎంతటి వారైనా విడిచి పెట్టేది లేదని ఆగ్రహ వ్యక్తం చేశారు. కాసుల కోసం కక్కుర్తి పడి నిబంధనలకు తిలోదకాలు పలికే రీతిలో వ్యవహరిస్తే కేసులు తప్పవన్నారు. బెల్ట్ షాపులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 41 మద్యం బాటిల్స్‌ను స్వాధీనం చేసుకుని ఆరుగురుపై కేసులు నమోదు చేశారు.

## నేడు ఎక్సైజ్ స్టేషన్ వద్ద ఆటో, రెండు ద్విచక్ర వాహనాలు వేలం

కంచిలి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :

ఈ నెల 8వ తేదీ మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంటకి ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు సోంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గతంలో నాటు సారా కేసులలో సీజ్ చేయబడిన ఒక ఆటో మరియు రెండు ద్విచక్ర వాహనాలకు వేలం పాట నిర్వహించనున్నట్లు సోంపేట ఎక్సైజ్ సీఐ జీవీ రమణ తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ధరావతు చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

## జంపు శేఖర్ ఔదార్యం .. రెల్లివీధి యువతకు రూ.5 వేలు అందజేత

వీరఘట్టం, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :



సహాయం చేయాలనే దృక్పథం ఉండాలే గాని అది ఏ రూపంలోనైనా చేయొచ్చు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్ఫూర్తితో మండల కేంద్రం రెల్లివీధిలోని యువతకు వాలీ బాల్ కిట్టును కొనుగోలు చేసేందుకు 5000 రూపాయలు నగదును అందజేసి అందరికీ ఆదర్శంగా నిలిచారు వీరఘట్టం పట్టణానికి చెందిన జనసేన నాయకులు జంపు శేఖర్. యువత మత్తు పదార్ధాలకు, చెడు వ్యసనాలకు బానిస కాకుండా క్రీడల వైపు మొగ్గు చూపెందుకు వారిని ప్రోత్సాహించే విధంగా శేఖర్ ఈ నగదును వారికి అందజేశారు. అలాగే క్రీడలతో పాటు విద్యాభ్యాసంపై కూడా దృష్టి సారించాలని, సమాజంలో మంచి ఆలోచనలతో ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రెల్లివీధి యువత జంపు శేఖర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

## ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతం



పొందూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :

స్థానిక సత్యసాయి సేవా సమితి మందిరంలో శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత నేత్ర చికిత్సా శిబిరం విజయవంతంగా నిర్వహించారు. ముందుగా సత్యసాయి నామకీర్తనలతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. మొత్తం 65 మందికి కంటి పరీక్షలు జరిపి మందులను అందజేశారు. వీరిలో 27మందికి కేటరాక్ట్ శస్త్ర చికిత్సల కోసం ప్రత్యేక వాహనంలో ఇదే రోజున విశాఖపట్నం (వేపగుంట)లోని శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తీసుకొని వెళ్ళారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ దున్న రాధాకృష్ణ ఆధ్వర్యం వహించారు. ఈ శిబిరంలో ఫౌండేషన్ నేత్ర వైద్య సహాయకులు డి.దీపక్, సీనియర్ మేనేజర్ ఎన్.అప్పలరాజు, క్యాంప్ సమన్వయకర్త ఎం.సాయికుమార్, మరో ఆప్తమాలిక్ అసిస్టెంట్ డి.రామచంద్రరావు, సేవా సమితి సభ్యులు గుడ్ల సాయిరాజు, మీసాల విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు సహకరించిన సత్యసాయి సేవా సమితి ప్రతినిధులను శంకర్ ఫౌండేషన్ బృందం కృతజ్ఞతలు తెలిపారు.

## మహిళా జర్నలిస్టుకు ఘన సన్మానం

### ఆమె కృషిని కొనియాడిన మాజీ మంత్రి శివాజీ



పలాస, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :

ఉద్దానం సాహితీ సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వజ్రపుకొత్తూరు మండలం అక్కుపల్లి గ్రామంలో శ్రీరామ సేవా సంఘం సౌజన్యంతో సంస్థ వేదిక నవ వసంతాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా సభకు ముఖ్య అతిథిగా పాల్గొని ఉద్దానం బందు బిరుదు అందుకున్న మాజీ మంత్రి గౌతు శివాజీ మాట్లాడుతూ గత 30 ఏళ్లుగా ఎమ్మెల్యేగా ఈ ప్రాంతానికి ప్రజా సేవలు అందిస్తూ వచ్చానని అన్నారు. నేడు ఉద్దానం బిడ్డ ఆంధ్ర ఫోకస్ పత్రిక సబ్ ఎడిటర్ , రాష్ట్ర మత్స్యకార మహిళా సంఘ ఉపాధ్యక్షురాలు పుక్కళ్ల కరుణ కుమారిని సన్మానించడం తనకు ఎంతో సంతోషాన్ని కలిగించిందని అన్నారు. ఆమెను మాజీ మంత్రి శివాజీ దుశ్శాలువ కప్పి మెమొంటో అందజేసి ఘనంగా సన్మానించారు. ఉద్దానంలో పోరాట పటిమ ఉందని తన తండ్రి సర్దార్ గౌతు లచ్చన్న ఈ ప్రాంతానికి చెందిన అనేక చరిత్రలు పోరాటాలు వివరించేవారని ఆయన బాటలో నడిచి అజాతశత్రువుగా ప్రజల మన్ననలను పొందానని గతాన్ని నెమరు వేసుకున్నారు. అదే సందర్భంలో ఈ ప్రాంతానికి చెందిన మహిళ కరుణ విశాఖపట్నంలో ఉంటూ మహిళా జర్నలిస్టుగా రాణించడం గొప్ప విశేషమని కొనియాడారు. అధ్యక్ష కార్యదర్శులు లండ రుద్రమ్మూర్తి శివజ్యోతి రాజారావు నిశ్చితాసి సూరాడ మోహన్‌రావు, దాసరి తాతారావు, అంబటి రామకృష్ణ, శ్రీరామ సేవా సంఘ అధ్యక్షులు మోస వరప్రసాద్ , తదితరులు పాల్గొన్నారు.

## పారా లీగల్ వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులు

పొందూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :

మండల న్యాయ సేవాధికార సంఘం అధ్యక్షులు మరియు జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న పారా లీగల్ వాలంటీర్లుగా నియామకానికి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు మరియు వయోవృద్దులు, అంగన్వాడీ కార్యకర్తలు, వైద్యులు/ఫిజీషియన్స్, విద్యార్థులు , న్యాయ సంబంధిత విద్యార్థులు (న్యాయవాదులుగా నమోదైనంతవరకు), రాజకీయేతర సభ్యులు, సేవాదృక్పదం కలిగిన ప్రభుత్వేతర సంఘ సభ్యులు మరియు క్లబ్ సభ్యులు, మైత్రి సంఘ సభ్యులు, ఇతర స్వయం సహాయక సంఘ సభ్యులు, ఇతర వెనుకబడిన సంఘ సభ్యులు ధరఖాస్తు చేయవచ్చునని తెలిపారు. పదవ తరగతి/ మెట్రిక్యులేషన్ అర్హత కలిగి ఉండవలెను. పొందూరు, జి.సిగడాం రెవిన్యూ మండలాల పరిధిలో నివాసితులై ఉండవలెను. ఆసక్తి గల అభ్యర్థులు రెండు పాస్ పోర్టు సైజు కలర్ ఫోటోలు, ఆధార్ కార్డు మరియు విద్యా సంబంధిత పత్రములతో మండల న్యాయసేవాధికార సంఘం కార్యాలయం, కోర్టు సముదాయం, పొందూరు వారిని ఉదయం గం.10-30 నుంచి సాయంత్రం గం.5-00ల వరకు ఈనెల 15 వ తేదీ మంగళవారంలోగా సంప్రదించవలెను. పూర్తి చేసిన ధరఖాస్తులను సమర్పించుటకు 15వ తేదీ మంగళవారం ఆఖరు తేదీగా నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. పారా లీగల్ వాలంటీర్లుగా నియమితులైనవారికి ఎటువంటి జీతభత్యములు గాని, పారితోషకములు గాని, వేతనములు గాని చెల్లించబడవని ఆమె తెలిపారు.



## మృతుల కుటుంబాలకు పరామర్శ

కంచిలి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :

కంచిలి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా విధులు చేపడుతున్న వావిలాపల్లి తిరుమలరావు మాతృమూర్తి కీ.శే. వావిలాపల్లి వజ్రం (85) ఇటీవలే ఆకస్మికంగా స్వర్గస్తులయ్యారు. కంచిలి మండలం, కొల్లూరు పంచాయతీ, కర్తలి గ్రామానికి చెందిన పైల తాతయ్య ధనలక్ష్మిల తనయుడు కీ.శే. పైల హృషికేష్ (5) గత రెండు సంవత్సరాలుగా బోన్ మారో క్యాన్సర్ వ్యాధితో పోరాడుతూ ఇటీవలే మృతి చెందారు. వారి చిత్రపటాలకు నివాళులు అర్పించి, వారి కుటుంబసభ్యులకు ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి, రిటైర్డ్ ఎంపీడీఓ పైల సూర్యనారాయణ రెడ్డి, దుర్గాసి ధర్మారావు, కొల్లి ఈశ్వరరావు, పలికిల జయరాం, మద్దు అభి యాదవ్, జామి జయ, శ్రీకాంత్ గౌడో, బల్లెడ సుమన్, గేదెల దాలయ్య, పైల గణేష్, పైల భీమారావు, గేదెల రామారావు తదితర పెద్దలు, యువకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## బెల్టు దుకాణాల నిర్వాహకులపై స్పెషల్ డ్రైవ్

కంచిలి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :



ఉన్నతాధికారుల సూచన మేరకు వారం రోజులుగా సోంపేట ఎక్సైజ్ పరిధిలోని కంచిలి, సోంపేట మరియు మందస మండలాల్లో బెల్టు షాపుల నిర్వాహకుల మీద స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నలుగురిపై కేసులు నమోదు చేసి 27 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. అలాగే బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తున్న ఇద్దరి మీద కూడా కేసులు నమోదు చెయ్యటం జరిగినది. బెల్టు దుకాణాలపై ఏదైనా ఫిర్యాదులు ఉంటే లేదా సమాచారం ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 14405 లేదా 9440902358 నెంబరుకు తెలియపర్చవచ్చును మరియు వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి. దాడులలో సోంపేట ఎక్సైజ్ సి.ఐ రమణ, ఎస్.ఐ ప్రసాద్, సిబ్బంది భానుప్రసాద్, గుణాకర్, ఉమాపతి, మార్కారావు, తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ల పంపిణీ



సీతంపేట సెప్టెంబర్7, ప్రభాతవార్త:

ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం కింద మంజూరైన గృహాల నిర్మాణానికి సంబంధించి 103 మంది గృహ లబ్ధిదారులకు సోమవారం ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్లను ఐటిడిఏ పీవో పవార్ స్వప్నిల్ అందజేశారు. లబ్ధిదారులకు భూమికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు అందడంతో గృహ నిర్మాణ పనులను ప్రారంభించేందుకు మార్గం సుగమమైంది. ఫారెస్ట్ స్థలాలు కావడంతో అటవీ శాఖతో ఇబ్బందులు రాకుండా ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్‌లను అందజేసినట్లు పీవో తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో జి. చిన్నబాబు, ఆర్ ఓ ఎఫ్ ఆర్ సిబ్బంది జగదీష్, మధు, తదితరులు పాల్గొన్నారు.

## విరాట్ విశ్వకర్మ దేవాలయానికి నీటి బోరు వితరణ

రాజాం, ఆగస్టు 7, ప్రభాతవార్త :



రాజాం, గాయత్రీ కాలనీలో శ్రీ విరాట్ విశ్వకర్మ దేవాలయం నిర్మాణం పనులు జరుగుతున్న నేపథ్యంలో, ఆధ్యాత్మిక సేవతో పాటు సామాజిక బాధ్యతను చాటుతూ రాజాం పట్టణ పరిధి కొండపేటకు చెందిన తాళాబత్తుల సాంబమూర్తి విశ్వకర్మ దేవాలయానికి బోర్‌వెల్‌ను విరాళంగా అందించారు. దేవాలయం నిర్మాణానికి నీటి సమస్యను గుర్తించి బోర్‌వెల్‌ను ఏర్పాటు చేసి మంచినీటి సదుపాయాన్ని కలిగించారు. ఈ సందర్భంగా దాత సాంబమూర్తి మాట్లాడుతూ దేవాలయానికి సేవ చేయడం తనకు ఎంతో సంతోషంగా ఉందని, ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం తన బాధ్యతగా భావిస్తున్నానని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఆలయ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. బోర్‌వెల్ ఏర్పాటుకు సహకరించిన దాతకు విజయనగరం జిల్లా విశ్వబ్రాహ్మణ సాధికారిక కమిటీ జిల్లా అధ్యక్షులు, విశ్వబ్రాహ్మణ సొసైటీ అధ్యక్షులు, ఆలయ ధర్మకర్త ముగడ శ్రీను, కమిటీ సభ్యులు, భక్తులు కృతజ్ఞతలు తెలుపుతూ, నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడంతో పాటు భక్తులకు మరింత సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, దాతను అభినందించారు. ఎం.జగదీష్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## పలాసలో ఆవులు, కుక్కలు స్వైరవిహారం

### - బెంబేలెత్తుతున్న జనం - పట్టించుకోని మున్సిపల్ అధికారులు

పలాస, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :



పలాసలో ఒక పక్క కుక్కల బెడద .. మరోపక్క ఆవుల మంద. పట్టణంలో ఎక్కడ చూసినా దర్శనమిస్తున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు నరక యాతన పడుతున్నారు. అలాగే వాహనాలకు అడ్డంగా ఉండటమో లేదంటే రోడ్డుకు అడ్డంగా పడుకోవడం మరో రకమైన ఇబ్బంది.. ఇంకొన్ని చోట్ల వీధి పోరాటాలు జరగటం మధ్యలో మనం బలి కావడం ఎప్పటికప్పుడు మనందరం చూస్తూనే ఉన్నాం .. ఇప్పుడు ప్రజల సహనం నశిస్తోంది, అదే ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గాయత్రీ నగర్‌కు చెందిన 10 ఏళ్ల బాలుడు లక్ష్మీ లిషాన్ సాయంత్రం ట్యూషన్ ముగించుకుని నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా, ఒక్కసారిగా వీధి కుక్కలు దాడి చేశాయి. తీవ్రంగా గాయపడిన బాలుడి ఆర్తనాదాలు విని స్థానికులు వెంటనే అప్రమత్తమై కుక్కలను తరిమివేశారు. మున్సిపాలిటీ పరిధిలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ తీవ్రరూపం దాల్చుతోందని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం ఎక్కడో ఒకచోట పాదచారులు, ద్విచక్ర వాహనదారులు, చిన్నారులపై కుక్కలు దాడులు చేస్తూనే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదాలు వరుసగా జరుగుతున్నా మున్సిపల్ అధికారులు కనీసం స్పందించకపోవడంపై ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కుక్కల బెడద నుంచి రక్షణ, ఆవుల వల్ల ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**అధికారుల దాటవేత**

అధికారులను ఎప్పుడు ప్రశ్నించినా కుక్కల కోసం టీం వస్తోంది ... అదుగో వచ్చారు.. ఇదుగో వచ్చారంటారు. చర్యలు మాత్రం శూన్యం. ఇక ఆవుల విషయంలోనూ అంతే... సంబంధిత యజమానులకు నోటీసులు ఇచ్చాం, గోశాలకు పంపిస్తామంటారు కానీ ఇప్పటి వరకు ఒక్క ఆవుని కూడా గోశాలకు పంపలేదు.

## కళలకు, కళాకారులకు ప్రోత్సహించాలి



కవిటి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :

కళలకు కళాకారులకు ప్రోత్సహించాలంటూ ఆలిండియా కళా రంగ వ్యవస్థాపకులు మాడుగుల కుమార్‌తో పాటు ఇచ్ఛాపురం మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు అలానే కవిటి ఎంపీపీ ప్రతినిధి కడియాల పద్మ ప్రకాష్, ఇచ్ఛాపురం వైసీపీ సమన్వయకర్త సాడి శ్యాంప్రసాద్ రెడ్డితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు అన్నారు. ఈ మేరకు కవిటి మండలం ఆర్ బెలగాం గ్రామంలో నాలుగో తేదీ నుండి ఏడో తేదీ వరకు శ్రీ మహతి సాంస్కృతిక కళాసేవా సంస్థ ఆధ్వర్యంలో సద్గురు జీరు పాపయ్య 36వ వర్ధంతిని పురస్కరించుకొని పలు సాంస్కృతిక కార్యక్రమాలు కళాకారులకు సన్మానం ఘనంగా నిర్వహించారు. ఒడిస్సా ప్రాంత సంగీత కళాకారులుచే సంగీత కార్యక్రమం కచేరీలు భజనలతోపాటు సాయంత్రం పూట జానపదాలు కూచిపూడి భరతనాట్యం వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం జరిగింది. అనంతరం పాల్గొన్న కళాకారులైన గేదెల ప్రకాష్ కారంకి పాపారావు కళాకారులకు ఘనంగా సన్మానించే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త దాసరి రాయితోపాటు శ్రీ మహతి సాంస్కృతిక కళా సేవా సమితి సమస్త కార్యవర్గ సభ్యులు, గౌరవ సభ్యులు, నవోదయ యువజన సంఘం సభ్యులు, గ్రామ సేవకులు, మహిళలు కోలాట బృంద సభ్యులు, ఆర్గనైజర్లు పాల్గొన్నారు. ఈ కళాకారులకు సన్మానించే కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ నాటకంగా డైరెక్టర్ దక్కత కామేశ్వర్ రెడ్డి, బాసుదేవరావు, శ్రీనివాసరావు, వినోద్, కుమార్ నాయక్ వంటి ప్రముఖులు పాల్గొని కళాకారులకు ఘనంగా సన్మానించే కార్యక్రమాన్ని చేపట్టారు.

## ముకుందరావుకు అండగా గల్ఫ్ మహా సేవా సంస్థ

కవిటి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :



కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న పెద్దకపాశుపతి గ్రామానికి చెందిన ఆర్.ముకుందరావుకు సహాయం చేసేందుకు కపాసుకుద్ది మహాసేవా సంస్థ ముందుకు వచ్చింది. ముకుందరావుకు కిడ్నీ మార్పిడి కోసం అధిక మొత్తంలో ఆర్థిక సహకారం అవసరం. ఆ కుటుంబం పరిస్థితి ఆర్థికలేమి దీంతో దాతల కోసం ఎదురుచూస్తున్న ఆ కుటుంబానికి కపాసుకుద్ది గ్రామానికి చెందిన గల్ఫ్ మహాసేవా సంస్థ సోమవారం నాడు 16,500 రూపాయల ఆర్థిక సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలతో పాటు ప్రతినిధులు పాల్గొన్నారు.

## నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.50 వేలు విరాళం



కోటబొమ్మాళి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:

కోరుకున్న వారికి కోరిన వరాలిచ్చు కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి నిత్యాన్నదాన ట్రస్ట్‌కు శ్రీకాకుళంకు చెందిన మాడుగుల మోహన్‌రావు రూ.50058 చెక్కు ద్వారా విరాళంగా ఇచ్చినట్లు కొత్తమ్మతల్లి ఆలయ కార్య నిర్వహణ అధికారి వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. ఈ మొత్తాన్ని కీర్తిశేషులు తమ తల్లిదండ్రులైన మాడుగుల సావిత్రమ్మ, బసవరాజు పేర్లు మీద ఇచ్చినట్లు ఈఓ తెలిపారు. ఈ సందర్భంగా మోహనరావుకు అమ్మవారి చిత్రపటంతో పాటు తీర్థప్రసాదాలను ఈఓ అందజేశారు.

## ఉత్సవ ఏర్పాట్లు పక్కాగా చేయాలి

కోటబొమ్మాళి, సెప్టెంబరు 7, ప్రభాతవార్త:



అక్టోబర్ నెలలో జరగనున్న కోటబొమ్మాళి కొత్తమ్మతల్లి ఉత్సవాల నేపథ్యంలో పక్కగా ఏర్పాట్లు చేయాలని టెక్కలి ఆర్డీఓ కృష్ణమూర్తి, ఈఓ రాధాకృష్ణకు, ఆలయ పాలక మండలి అధ్య క్షులు కోరాడ గోవింద్‌కు చూచించారు. సోమ వారం వీరిరువురు టెక్కలిలోని ఆర్డీఓ కార్యాల యంలో ఉత్సవాల విషయంపై చర్చించారు.

## చెవిటి , మూగ పాఠశాలకు చెందిన ఆటో బోల్తా

### మూగ విద్యార్థికి తీవ్రగాయాలు



రాజాం, ఆగస్టు 7, ప్రభాతవార్త :

రాజాం పట్టణంలో శ్రీకాకుళం రహదారిలో టీవీఎస్ షోరూం ఎదురుగా ఆటో బోల్తా పడడంతో స్థానిక మూగ చెవిటి పాఠశాలకు చెందిన కోట రామకృష్ణ విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఆటో డ్రైవర్ మద్యం మత్తులో ఆటోను నడపడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడిన విద్యార్థిని మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం తరలించారు.

## ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులో ఇద్దరి అరెస్ట్

కొత్తూరు, సెప్టెంబర్ 7 ప్రభాతవార్త:

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులో కొత్తూరు గ్రామానికి చెందిన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. కేసుపై టెక్కలి డీఎస్పీ ఆధ్వర్యంలో సమగ్ర దర్యాప్తు చేపట్టిన అనంతరం సొంట్యాన నవీన్, టోంపల వినయ్‌కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తు అనంతరం నిందితులను శ్రీకాకుళం ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచారు. కేసును పరిశీలించిన న్యాయస్థానం వారికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. దీంతో కోర్టు ఆదేశాల మేరకు ఇద్దరిని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. కేసుకు సంబంధించి దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. పోలీసులు, తదితరులు పాల్గొన్నారు.

8vzm15:8vzm15.qxd 08-09-2026 00:04 Page 1



## ఉపాధ్యాయులకు టార్గెటెడ్ ఫుడ్ ఫోర్టిఫికేషన్ పై మండల స్థాయి శిక్షణ



**కురుపాం, సెప్టెంబర్ 7, ప్రభాత వార్త:**

కురుపాం జిల్లా పరిష త్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పాఠశాల ఉపాధ్యాయులకు టార్గెటెడ్ ఫుడ్ ఫోర్టిఫికేషన్ (టిఎఫ్ఎఫ్) పై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. సోమవారం. విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ - టాటా ట్రస్ట్ సహకారంతో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ-1 సత్యనారాయణ , ఎంఇఓ-2 రాధాకృష్ణ హాజరై పలు విషయాలు వివరించారు.. ప్రత్యేక అతిథులుగా పార్వతీపురం-మన్యం జిల్లా ఎండిఎం సూపరింటెండెంట్ రంగాచార్యులు , కోఆర్డినేటర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. రిసోర్స్ పర్సన్లుగా డాక్టర్ షణ్ము , విసిఎఫ్ ప్రోగ్రాం అసోసియేట్ చక్రధర్ (కురుపాం), విసిఎఫ్ పీఏ సౌజన్య (భద్రగిరి), వేదశ్రీ - భామిని అల్లు కృష్ణారావు (సీతంపేట) తదితరులు పాల్గొని శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో 160 మంది పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సిఆర్పిలు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఫుడ్ ఫోర్టిఫికేషన్ చరిత్ర, ప్రధాన ఆహారం , 10 రకాల ఆహార వైవిధ్యం, వంట విధానాలు, పరిశుభ్రత పాటించాల్సిన పద్ధతులు, ఫోర్టిఫైడ్ బియ్యం, నూనె, ఉప్పు తయారీ విధానం మరియు నిల్వ పద్ధతులు, ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ వినియోగం పై వివరించారు .ఇంచార్జ్ లు తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు.

## మొక్కుబడిగా సాలూరు - పాచిపెంట ఆర్టీసీ బస్సు



### ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

**పాచిపెంట, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :**

సాలూరు ఆర్టీసీ డిపో నుంచి సాలూరు పాచిపెంట ఆర్టీసీ బస్సు మొక్కుబడిగా ఆర్టీసీ అధికారులు నడుపుతున్నారన్న విమర్శలు విరివిగా వినిపిస్తున్నాయి. సాలూరు పాచిపెంటకు , సాలూరు ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి బస్సు ఉదయం 7, గంటల నుండి 9:30 వరకు మూడు ట్రిప్పులు పాచిపెంటకు అలాగే మధ్యాహ్నం 2. 1/4 నుండి ఐదున్నర గంటల వరకు నాలుగు ట్రిప్పులు ఆర్టీసీ బస్సు నడుపుతున్నారు. ఉదయం 9:30 తర్వాత రెండు గంటల లోపు బస్సు లేకపోవడం సాయంత్రం 5:30 తర్వాత ఆర్టీసీ బస్సు, సాలూరు నుంచి పాచి పంటకు లేకపోవడం వలన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారు. గత ఏడాది ఆగస్టు 15 నుండి కూటమి ప్రభుత్వం మహిళల సౌకర్యార్థం కొరకు స్త్రీ శక్తి పథకం ద్వారా ఆర్టిసి బస్సులు మహిళలు రాకపోకులకు ఉచిత బస్సులు ఏర్పాటు చేశారు. రాష్ట్రమంతటా స్త్రీ శక్తి పథకం ద్వారా మహిళలందరూ సద్వినియోగం చేసుకుంటున్నారు. సాలూరు నియోజకవర్గంలో పాచిపెంట మండలానికి మాత్రం మొక్కుబడిగా ఆర్టీసీ అధికారులు ఒకే ఒక బస్సును నడుపుతున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకుఏడు ట్రిప్పులు బస్సు నడపడం ఉదయం10 గంటలనుండి రెండు గంటల వరకు ఆర్టీసీ బస్సు లేకపోవడం అలాగే సాయంత్రం 6 గంటల నుండి కనీసం ఎనిమిది గంటల లోపు ఆర్టీసీ బస్సు లేకపోవడం వలన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు కు గురవుతున్నామని విద్యార్థులు ఒకవైపు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో లేని విధంగా పాచిపెంట మండలం మారుమూల మండలం కావడం వలన ప్రభుత్వం అమలు చేసిన స్త్రీ శక్తి పథకం మొక్కుబడిగా ఆర్టీసీ అధికారులు కొనసాగిస్తున్నారన్న విమర్శలు మహిళలు పురుషులు వృద్ధులు వ్యక్తం చేస్తున్నారు . పాచిపంట మండల కేంద్రం నుండి అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రజలు అనేక అవసరాల నిమిత్తం ఇతర పట్టణాలకు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వారి పనులు ముగించుకొని సాయంత్రం 9 గంటల లోపు సాలూరు వచ్చినప్పటికీ ఆర్టీసీ బస్సు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యార్థులకు ప్రయాణికులకు ఒకే బస్ కావడం వలన బస్సు రద్దీ పెరగడంతో ఇబ్బంది పడుతూ ప్రయాణిస్తున్నమని పలువురు వాపోయారు. ఈ విషయం పలుమార్లు మండల సమావేశంలో ప్రజాప్రతినిధులు విన్నవించుకున్నప్పటికీ అలాగే ఆర్టీసీ అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సాలూరు నుండి పాచిపంట కు కనీసం రాత్రి తొమ్మిది గంటల వరకు ఆర్టీసీ బస్సు నడిపే విధంగా చర్యలు చేపట్టాలని పాచిపెంట మండల ప్రయాణికులు కోరుతున్నారు. పాచిపెంట మండలంలో సాలూరు నుండి ఒక పాచి పెంట తప్ప ఇతర గ్రామాలకు శ్రీ శక్తి బస్సు నడపకపోవడం గమన హారం. మధ్యాహ్నం ఒంటిగంటకు సాయంత్రం ఏడు, తొమ్మిది గంటలకు ఆర్టిసి బస్సు నడిపే విధంగా రాష్ట్ర గిరిజన శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి స్పందించి చర్యలు చేపట్టాలని పలువురు కోరారు. పాచిపెంటకు మరియు మండలం లో పూడి, మాతుమూరు, కేసలీ గ్రామాలకు ఆర్టీసీ బస్సులు నడపాలని పలువురు కోరుతున్నారు.

## వినాయకచవితి తొమ్మిదిరోజులే అనుమతి : టౌన్ సీఐ

### పోలీస్ శాఖ సింగిల్ విండో ద్వారా ఆన్‌లైన్‌లో పర్మిషన్



**సాలూరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :**

జరగబోయే వినాయకచవితి సందర్భంగా జిల్లాఎస్పీ కె.మాధవరెడ్డి ఆదేశాల మేరకు సింగిల్ విండో విధానం ద్వారా గణేష్ మండపాలకు ఆన్ లైన్ లో ధరఖాస్తులు చేసుకోవాలని పట్టణ సీఐ అప్పలనాయుడు తెలిపారు. సోమవారం టౌన్ పోలీస్ స్టేషన్ లో మీడియా ప్రెస్మీట్ ఏర్పాటుచేసి మాట్లాడుతు పోలీస్ శాఖ మున్సిపాలిటీ, రెవెన్యూ అలాగే ఫైర్,విధ్యుత్ శాఖల అనుమతులన్నీ ఒకేచోట లభించే విధంగా ఏర్పాటు చేశారన్నారు. అంతేకాకుండా ఎవరికి ఎటువంటి ఇబ్బంది లేకుండా వినాయక చవితి ఉత్సవాలు జరుపుకోవాలని అలాగే మండపాల వద్ద సీసీ కెమారాలు ఏర్పాటు చేయాలని ఇంకా డీజేలకు అనుమతి లేదన్నారు.అలాగే గణేష్ ఉరేగింపు నిమజ్జన సమయంలో పోలీస్ వారి చట్టపరమైన సూచనలు,నిభంధనలు తప్పనిసరిగా పాటించి సహకరించాలని టౌన్ సీఐ క్లారిటీ ఇచ్చారు.పట్టణ ఎస్ఐ అనిల్ కుమార్,సిబ్బంది పాల్గొన్నారు.

## పోస్ట్ ఆఫీస్ పథకాల కరపత్రాలను విడుదల చేసిన సీఐ




**గజపతినగరం, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :**

గజపతినగరం పోస్ట్ ఆఫీస్ పథకాలను గ్రామీణ ప్రజలందరూ వినియోగించుకోవాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్. సన్యాసినాయుడు అన్నారు. సోమవారం పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ఇన్స్పెక్టర్ ఉపేంద్ర రూపొందించిన పథకాల కరపత్రాలను సర్కిల్ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలు పొదుపు చేసుకోవడానికి పోస్ట్ ఆఫీస్‌లు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల నగదును డి బి టి ద్వారా పోస్ట్ ఆఫీస్ లో అత్యధిక మందికి పడుతుందని తెలిపారు. పోస్టల్ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర మాట్లాడుతూ ఉత్తరాలు, పార్సిల్ లు విదేశాలకు సైతం గ్రామస్థాయి నుంచే పంపే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోస్టర్ సిబ్బంది పాల్గొన్నారు.

## అనకాపల్లి జిల్లా స్థానిక ఎన్నికల ఇన్చార్జిగా కేఏ నాయుడు

**గజపతినగరం,సెప్టెంబర్ 7,ప్రభాతవార్త :**

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కే ఏ నాయుడుని అనకాపల్లి నియోజకవర్గానికి స్థానిక ఎన్నికలకు ఇన్చార్జిగా పార్టీ అధిష్టానం నియమించింది. నాయుడు గత ఎన్నికల్లో పార్టీ టికెట్ ఇవ్వకుండా అధిష్టానం నిర్ణయించడంతో కొంతకాలం స్తబ్దత గా ఉన్నారు అయినా పార్టీ కార్యక్రమాలను మాత్రం ఆయన తన వెంట ఉన్న పార్టీ కార్యకర్తలతో నిర్వహించేవారు. పార్టీ పట్ల ఆయన అసంతృప్తితో ఉన్నప్పటికీ పార్టీని నమ్ముకునే వస్తు వచ్చేవారు. అయితే ఈ నియామకముతో ఆయన వర్గానికి చెందిన కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం వచ్చింది.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సత్కారం

**రామభద్రపురం, సెప్టెంబర్ 7,ప్రభాత వార్త:**



ఈరోజు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పూడి వీధిలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందినందుకు గాను మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పాఠశాల విద్యా కమిటీ మరియు ఉపాధ్యాయ విద్యార్థులు మరియు విద్యార్థుల తల్లిదండ్రులు అందరూ కలిసి పాఠశాలలో శ్రీనివాసరావుని ఘనంగా సత్కరించడం జరిగింది. ఈ సత్కార కార్యక్రమంలో పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బంకురు శంకర్రావు అలాగే వైస్ చైర్మన్ శ్రావణి మరియు విద్యా కమిటీ సభ్యులు విద్యార్థులు తల్లిదండ్రులు అందరూ కూడా వచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి అయినటువంటి తిరుమల ప్రసాద్ రావు విచ్చేసి సన్మాన రైతుకు ఘనంగా సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.

## డిగ్రీ కళాశాలలో స్కిల్ డెవలప్మెంట్ కోర్సులు

**నెల్లిమర్ల, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :**

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల పి. ఎం ఉష పథకం స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ కింద నర్సరీ మేనేజ్మెంట్, వర్మి కంపోస్టింగ్ సర్టిఫికెట్ కోర్సులను ప్రారంభించినట్లు వృక్షశాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ వై. విజయభారతి తెలిపారు. ఈ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. వాణి తెలిపారు. విద్యార్థులు చదువుతున్న కోర్సులతో పాటు, అదనంగా స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ నేర్చుకోవడం వాటిపై అదనపు నైపుణ్యం వస్తుందని, మరింత మందికి తెలియపరచడానికి అవకాశం ఉంటుందని ఐ. క్యూ. ఏ. సి. కోఆర్డినేటర్ డాక్టర్ జయపాల రావు మాట్లాడారు. బోటనీ విభాగధిపతి, డాక్టర్ ఎస్. రాధ,డాక్టర్ శాంతి ప్రభ తదితరులు పాల్గొన్నారు.

## ఆఖరి ఓటర్ జాబితాను నోటీస్ బోర్డుకు అంటించిన ఎంపీడీవో



**దత్తిరాజేరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :**

మండలంలోని 35 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఫైనల్ ఓటర్ జాబితాన్ని విడుదల చేయడం జరిగిందని. ఎంపీడీవో,ఎస్ తాత తెలిపారు, సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నోటీస్ బోర్డులో ఓటర్ జాబి తాను అంటించడం జరిగిందన్నారు, 35 గ్రామపంచాయతీలకు సంబంధించి మొత్తం ఓట్లు, 45761 మంది గాను, పురుషులు ఓట్లు 22,638, స్త్రీలు ఓట్లు 23 122, ఇతరులు ఒకరు ఉన్నారన్నారు. ఎస్సీలు 5216 మంది, ఎస్టీలు76, మంది, బీసీలు 37,294, ఓసీలు 2545 మంది, ఉన్నారన్నారు, మొత్తం ఓట్ల న్నీ ఆన్లైన్లో అప్లోడ్ చేశామన్నారు, తప్పుల్లేని ఓటర్ జాబితాను తయారు చేసామన్నారు. కార్యక్రమంలో సీనియర్ సహాయకులు శ్రీనివాస్ టైపిస్ట్ రవి, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయుడికి ఘన సన్మానం



**కురుపాం, సెప్టెంబర్ 7, ప్రభాత వార్త :**

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా జిల్లా కలెక్టర్ ద్వారా అవార్డ్ అందుకున్న ఆకుల జగదీశ్వరరావుకు స్నేహ కళా సాహితి సభ్యులు ఘనంగా సన్మానించి సత్కరించారు. సోమవారం కురుపాం స్నేహ కళా సాహితి భవనం లో ఉపాధ్యక్షుడు బి.ఎల్.ప్రకాష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడు అందవరపు కోటేశ్వరరావు సేవలను కొనియాడారు. పలువురు సభ్యులు ఉపాధ్యాయ వృత్తిని కొని ఆడారు. ఈ కార్యక్రమంలో కవి గాయకుడు రౌత్ బంగారు నాయుడు, కార్యదర్శి గంగునాయు ,గౌటారి వెంకట్రావు, గంగు నాయుడు, గణేష్ మాస్టారు, మూర్తి, ఉపేంద్ర, పాండురంగ రావు ఉపాధ్యాలు, జె.దేవి ప్రసాద్,కె విశ్వనాథం,ఎన్ .మురళీకృష్ణ, మద్ది సుధాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**గరుగుబిల్లి, సెప్టెంబర్ 7, ప్రభాత వార్త:**



పార్వతీపురం-పాలకొండ ప్రధాన రహదారి పరిధిలోని మండలం లోని ఉల్లిభద్ర గ్రామ సమీపంలోని తోటపల్లి కుడి ప్రధాన కాలువ వద్ద గుర్తుతెలియని వాహనము ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందాడని స్థానిక ఎస్ఐ షేక్ ఫక్రుద్దీన్ ఆదివారం తెలిపారు. జియ్యమ్మవలస మండలం పెద మేరంగి గ్రామానికి చెందిన గంట మహేష్ (35) సోమ వారం రాత్రి సుమారు తొమ్మిది గంటల సమయంలో పార్వతీ పురం నుంచి మోటార్ సైకిల్ పై వస్తుండగా ఎర్రన్న గుడి వైపు నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఉల్లి భద్ర సమీపంలోని తోటపల్లి కుడి కాలువ వద్ద ఢీకొనడంతో మృతి చెంద డం జరిగిందన్నారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారన్నారు. శవ పంచనామా నిర్వహించిన అనంత రం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నామని పేర్కొన్నారు. గుర్తు తెలియని వాహనమును గుర్తించేందుకు అదే విధముగా త్వరితగతిన కేసును ఛేదించేందుకు పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పి ఎస్వి మాధవ్ రెడ్డి తగు సూచనలు సలహాలను అందజేయడం జరిగిందన్నారు. అదే విధంగా చిన మేరంగి సర్కిల్ ఇన్స్పెక్టర్ టివి తిరుపతిరావు ఆధ్వర్యంలో గుర్తు తెలియని వాహనమును గుర్తించేందుకు 5 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడంతో పాటు పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజ్లను పరిశీలించడం జరుగు తుందని ఎస్ఐ షేక్ ఫక్రుద్దీన్ తెలిపారు.

## గణేష్ మండపాలు ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి

**గరుగుబిల్లి, సెప్టెంబరు 7, ప్రభాత వార్త:**

గణేష్ మండపాలు ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి అని అదేవిధంగా గణేష్ మండపాలు ఏర్పాటుకు సంబంధించిన అన్ని రకాల అనుమతులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సింగిల్ విండో విధానమును అందుబాటులోకి తీసుకువచ్చి సులభతరం చేయడం జరిగిందని మండల పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ షేక్ ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. ఈమేరకు ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈనెల 14వ తేదీ నుండి ప్రారంభం కానున్న వినాయక చవితి వేడుకల నేపథ్యంలో రాష్ట్ర డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా అదేశాల మేరకు వినాయక చవితి ఉత్సవాలకు సంబం ధించిన అన్ని రకాల అనుమతులు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సింగల్ విండో విధానమును ప్రజల్లోకి అందుబాటులోకి తీసుకువచ్చి సులబ తరం చేసిందని మండల పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ షేక్ ఫక్రుద్దీన్ పేర్కొన్నారు.

## మరడాంలో పారిశుధ్య పనులు

**దత్తిరాజేరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :**



మండల పరిధిలోని మరడాం గ్రామపంచాయతీలో పారిశుధ్య పనులు చేపట్టడం జరిగిందని గ్రామపంచాయతీ కార్యదర్శి శివరామకృష్ణ అన్నారు. సోమవారం మరడాం, మధుర గ్రామం అయిన,మర్రి వలస, గ్రామాల్లో ఉన్న అన్ని కాలువలో పేరుకుపోయిన చెత్త మరియు, మురుగునీరును బయటికి తీయించి, ట్రాక్టర్ ద్వారా చెత్త సంపద కేంద్రానికి తరలించడం జరిగిందన్నారు, అలాగే వాటర్ ట్యాంకులో ఉన్న నీరును బయటకు తోడించి ట్యాంక్ ను శుభ్రంగా క్లీన్ చేసామన్నారు, గ్రామంలో ఎక్కడ చెత్త లేకుండా పరిశుభ్రంగా చేసామని తెలిపారు. దోమలు బెడద లేకుండా కాలువలును దోమల మందును స్ప్రే చేసామన్నారు. గ్రామాన్ని పరిశుభ్రం చేసినందుకు గ్రామస్తులు కార్యదర్శికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతల శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

## 2 వేల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలకు ప్రణాళికలు



**రామభద్రపురం, సెప్టెంబర్ 7, ప్రభాత వార్త,:**

మండలంలో ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో 2వేల హెక్టార్లలో ప్రత్యామ్నాయ పంటలకు నివేదికలు తయారు చేసి జిల్లా అధికారులకు పంపామని మండల వ్యవసాయాధికారి అవ రాశివ తెలిపారు. మండల వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఆయన విలేఖర్లతో మాట్లాడారు. ఎల్నినో ప్రభావంతో ఇప్పటివరకు వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో రానున్న రోజుల్లో వరిసాగు పూర్తిగా నిలిపివేయాలని సూచించారు. అలాగే వరి ఆకు ముదిరిపోవడం, చెరువుల్లో నీరు లేకపోవడంతో వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలు సాగుచేయాలని సూచించారు. ఇప్పటికే ప్రత్యామ్నాయ పంటల్లో భాగంగా పెసలు, మినుములు, వేరుశెనగ, రాగి, ఉలవలు సాగుచేయాలని తెలియచేశారు.

## లీఫ్ పాఠశాలగా భోగాపురం జెడ్‌పి స్కూల్

**భోగాపురం, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:**



అంతర్జాతీయ విమానాశ్రయం, అనుబంధ ప్రాజెక్టుల రాకతో వేగంగా అభివృద్ధి చెందుతున్న భోగాపురం ప్రాంత భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలను 'లీఫ్' (లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్ ) మోడల్ స్కూల్‌గా అభివృద్ధి చేయనున్నట్లు నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి తెలిపారు. సోమవారం సంబంధిత అధికారులతో కలిసి పాఠశాలను పరిశీలించిన ఆమె, పాఠశాల అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికపై అధికారులతో చర్చించారు.ఒకటి నుంచి పదో తరగతి వరకు 2 వేల మంది విద్యార్థులకు సరిపడేలా సుమారుగా 6 ఎకరాల విస్తీర్ణంలో పాఠశాలను అభివృద్ధి చేయనున్నారు. ప్రభుత్వ నిధులతో పాటు కార్పొరేట్ సంస్థల సీఎస్ఆర్ నిధులను సమన్వయం చేసి ఆధునిక వసతులు కల్పించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

## పోస్టల్ సేవలపై అవగాహన కార్యక్రమం



**దత్తిరాజేరు, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని ఇంగిలాపల్లి గ్రామంలో ఇంటింటికి వెళ్లి పోస్టల్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించడం జరిగిందని గజపతినగరం సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్పెక్టర్ ఉపేంద్ర తెలిపారు. సోమవారం ఇంగిలాపల్లిలో పోస్టల్ పథకాలపై అవగాహన సదస్సు , ర్యాలీ సోమవారం నిర్వహించారు. ప్రజలకు ఉపయోగపడే పథకాలను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చింది అన్నారు. పథకాలనుప్రజలువాటిని వినియోగించుకొని పోస్ట్ ఆఫీస్లో, కట్టాలన్నారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. అనంతరం గ్రామంలోని పాఠశాలకు వెళ్లి సుకన్య సమృద్ధి యోజన పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ గురించి వివరించారు. ఈ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ గిరి సిబ్బంది పాల్గొన్నారు.

విజయనగరం పార్వతీపురం మన్యం 25 వార్త

## పారాది హైస్కూల్లో సాఫ్ట్బాల్ పోటీలు విజయవంతం చేయండి

**బొబ్బిలి, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:**

జడ్పీహెచ్ఎస్ పారాది స్కూల్ గ్రౌండ్స్‌లో ఈనెల 11, 12, 13 తేదీల్లో సబ్ జూనియర్స్ సాఫ్ట్ బాల్ టోర్నమెంట్ కు విజనగరం జిల్లా సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు బేబీ నాయన ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగినది దీనికి వెరీ నైస్ పొందిన 15 జిల్లాల నుంచి సుమారుగా 7 నెంబర్ క్రీడాకారులు 200 మంది అఫీషియల్సు వచ్చి ఈ టోర్నమెంట్‌లో పాల్గొనడం జరుగును ఇక్కడ నేషనల్ టీమ్ జరిపి మధ్యప్రదేశ్లో సంభాజీ నగర్‌లో నేషనల్‌లో పాల్గొనుటకు టీం ని ఎంపిక చేయడం జరుగుతుంది కావున ఈ యొక్క రాష్ట్రస్థాయి పోటీలు పారాది వేదిక కావడం ఇదే స్వర్గంలో నాకు ఒక గొప్ప అవకాశం గా భావించి బేబీ నాయన అందరిని కూడా ఈ టోర్నమెంట్ ఆహ్వానితులుగా పత్రిక ముఖంగా తెలియజేయడం జరిగినది.

## మద్యం తాగి వాహనాలు నడిపిన ముగ్గురికి జరిమానా

**పాచిపెంట, సెప్టెంబర్ 7, ప్రభాతవార్త:**

మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన ముగ్గురికి ఒక్కొక్కరికి పదివేల రూపాయలు చొప్పున న్యాయ మూర్తి హర్షవర్ధన్ జరిమానా విధించినట్లు పాచిపెంట ఎస్ఐ ఎల్. అర్జున్ విలేకరులకు తెలిపారు. వీరిని సాలూరు కోర్టుకు తరలించినట్లు చెప్పారు. ఆ మేరకు సాలూరు కోర్టులో జడ్జి హర్ష వర్ధన్ ఒక్కొక్కరికి 10 వేల రూపాయలు చెప్పున ముగ్గరికి 30 వేల రూపాయలు జరిమానా విధించారు. మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని తెలిపారు. అలాగే మోటార్ వెహికల్ చట్టం ప్రకారం వాహనాలు నడిపిన ప్రతి ఒక్కరు ధ్రువపత్రాలు వాహనంలో ఉంచాలని తెలిపారు. నిబంధనలు వాహనాలు అతిక్రమించినట్లయితే వారిపై చర్యలు తప్పు అని హెచ్చరించారు.

## తాగునీటి పథకం పనులకు భూమిపూజ

**వేపాడ, సెప్టెంబర్ 7:**



మండలంలోని పెదగుడిపాల గ్రామంలో మంచినీటి సమస్య పరిష్కారానికి గాను తాగునీటి పథకం పనులకు సోమవారం భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఈ నేపథ్యంలో నీలకంటరాజుపురం పంచాయతీ పరిధిలోని పెదగుడిపాల గ్రామంలో ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీటిని సరఫరా చేసేందుకు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గ్రామంలో తాగునీటి వ్యవస్థ ఏర్పాటు నిమిత్తం జిల్లా మినరల్ ఫండ్స్ (డీఎంఎఫ్) నుంచి రూ.10 లక్షల నిధులను మంజూరు చేయించారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు పి వెంకటరమణ మాట్లాడుతూ, పెదగుడిపాల గ్రామంలోని ప్రతి కుటుంబానికి సురక్షితమైన తాగునీరు నిరంతరం అందాలన్న సంకల్పంతోనే ఎమ్మెల్యే లలితకుమారి ఈ నిధులను ప్రత్యేకంగా కేటాయించారని తెలిపారు. ఏళ్ల తరబడి వేధిస్తున్న తాగునీటి సమస్యను గుర్తించి, వెంటనే నిధులు మంజూరు చేయించి పనులను ప్రారంభించడం పట్ల ఉపాధ్యక్షులతో పాటు పెదగుడిపాల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. తమ గ్రామానికి అండగా నిలిచిన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి వారు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు.

## విజయవంతంగా పారాది వంతెన ట్రయల్ రన్



**బొబ్బిలి ,సెప్టెంబరు 7, ప్రభాతవార్త:**

బుడా చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు ఆధ్వర్యంలో పారాది వంతెన ట్రయల్ రన్ టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు కార్యకర్తల నడుమ విజయవంతమైంది. దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ... ఎమ్మెల్యే బేబీనాయనకి బొబ్బిలి ప్రాంత ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, కృతజ్ఞతలు తెలిపారు. పారాది గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న వంతెన పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. ఉదయం ఆర్‌డబీ అధికారులు ఆధ్వర్యంలో ట్రయల్ రన్ ఏర్పాటు చేయడం జరిగింది.. ఈ కార్యక్రమానికి బుడా చైర్మన్ మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు..వారితో పాటు బొబ్బిలి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జ్ గిరడ అప్పలస్వామి టీడీపీ సీనియర్ నాయకులు అల్లాడ భాస్కర్రావు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేమకోటి గిరిబాబు పెంట స్వామినాయుడు తదితరులు పాల్గొన్నారు. తెంటు లక్ష్మునాయుడు మాట్లాడుతూ, ఎమ్మెల్యే బేబీనాయన మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరుగుతున్న వర్క్ షాపులో పాల్గొనడానికి వెళ్ళినందున అందుబాటులో లేరని, నిర్ణయించిన ముహుర్తానికి ఈ ట్రయల్ రన్ జరగడం ముఖ్యమని వారు తెలిపినట్లు చెప్పారు.. సుమారు రూ17.83 కోట్ల రూపాయల అంచనాలతో నిర్మాణం జరిగిన ఈ వంతెనను త్వరలోనే ఘనంగా ప్రారంభించారు.

## బీసీ బాలుర హాస్టల్‌ను సందర్శించిన ఎంపిపి అనూషారెడ్డి



**ప్రభాతవార్త - భోగాపురం:**

మండల కేంద్రంలోని బీసీ బాలుర హాస్టల్‌ను ఎంపీపీ ఉప్పాడ అనూషారెడ్డి సోమవారం సందర్శిం చారు. హాస్టల్ భవనం గతంలో మరమ్మతులకు గురికావడంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొ న్నారు. దీంతో కొంతకాలం హైస్కూల్‌లోని ఒక గదిలో ఖాళీగా ఉన్న ఒక్క గది వీరికి కేటాయించారు. ఇబ్బందులు ఎదుర్కొన్న విషయాన్ని గుర్తించిన ఎంపీపీ సమస్యను అధిగమించేందుకు పూనుకున్నారు. మండల, జిల్లా పరిషత్ నిధులతో భవనానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులను కూడా కల్పించారు. ప్రస్తుతం ఈ హాస్టల్లలో 25 మంది విద్యార్థులు ఉన్నారు.వచ్చే ఏడాది ఈ సంఖ్యను అధిగమించాలని వార్డెన్ శరణ్మయకు సూచించారు. ఆమె వెంట ఎం పీ ఎస్ ఓ డీడీ. స్వరూపరాణి,ఈఓపిఆర్డి గాయత్రి,ఎంఈఓ చంద్రమౌళి ఉన్నారు.

## ప్రజా చైతన్యంలో పోలీసులు.. నిత్యం ప్రజలతో మమేకం

### ప్రజా సంబంధాలు మెరుగులో పురోగమనం




**గరివిడి, సెప్టెంబర్ 7, ప్రభాత వార్త:**

ప్రజా చైతన్యంలో పోలీసులు ముందడుగు వేస్తున్నారు. నిత్యం ప్రజలతో మమేకం అవుతూ అనేక అంశాలపై వారిని జాగృత పరుస్తున్నారు. మాధకద్రవ్యాల పైన, అక్రమ గంజాయి రవాణా పైన ప్రజలకు అవగాహన కల్పిస్తూ, సైబర్ నేరాలపై అవగహన సదస్సులు నిర్వహిస్తూ ఉన్నారు. ట్రాఫిక్ నిబంధలు పైనా వాహన దారులకు నిరంతరం అవగాహన కల్పిస్తూ పోలీసులు ముందుకు సాగుతున్నారు. జిల్లా ఎస్పీ దామోదర్ ఆదేశాలు మేరకు చీపురుపల్లి డివిజన్ పరిధిలో చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘవులు నేతృత్వంలో సి ఐ జి.శంకర రావు ఆధ్వర్యంలో సర్కిల్ పరిధి లోగల గరివిడి, బుదరాయవలస,గుర్ల, చీపురుపల్లి పోలీస్ స్టేషన్ ఎస్ ఐ లు డివిజన్ పరిధిలో గల ఆయా స్టేషన్ ల పోలీసులు సైతం నిత్యం ప్రజల మధ్యే ఉంటూ అనేక అంశాలపై అవగాహన కల్పిస్తూ ప్రజాభిమానాన్ని చూరగొంటున్నారు. పల్లె నిద్ర తో పల్లె వాసుల అభిమాన్ని పొందుతున్నారు.పోలీసులు, ప్రజల మధ్య సత్సంబంధాలు పొందే క్రమంలో పోలీసు శాఖ ముందుకు సాగుతోంది. ఎస్పీ ఆదేశాలు పాటించడం లో చీపురుపల్లి డివిజన్ పోలీసులు ముందుండటం ప్రశంసనీయం.ట్రాఫిక్, నేరాలు, మాధకద్రవ్యాలు వినియోగం,అక్రమ గంజాయి రవాణా, పల్లె నిద్రలో ప్రజలకు అవగాహన కల్పించే క్రమంలో పోలీస్ శాఖ పురోగమించడం వంటి కార్యక్రమాలు తో ప్రజల తో మరింత సంబంధాలు మెరుగు పరుచుకుంటూ ఉండటం ,ప్రజలు తో మైత్రీ పోలీసులు గా ముద్ర సముపార్జించుకుంటూ పురోగమించడం అభినందనీయం.ప్రజా సంబంధాలు మెరుగు పరుచుకుంటూ పోలీస్ శాఖ పురోగమనం అభిలషనీయం.అదే బాణీ కొనసాగితే నేరాలు తగ్గి, ప్రశాంత సమాజావిష్కరణ కు అవకాశం ఉంటుంది పేర్కొనవచ్చు.